# ప్రచారంలో బీఆర్ఎస్ దూకుడు



మహాముత్తారం : చేన్ల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్న నాయకులు



మహదేవపూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- పార్టీ మ్యానిఫెస్టో ప్రతుల పంపిణీ
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను
- వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు
- కారు గుర్తుకే ఓటెయ్యాలని వినతి

మహాముత్తారం, నవంబర్27: మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. సోమవారం మండలంలోని ఉట్లపల్లిలో బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు లింగమల్ల రమాదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి బొట్టు పెడుతూ ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి పుట్ట మధుకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### పుట్ట మధును గెలిపించాలి

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తోంది. సోమవారం ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు గడప గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటేసి పుట్ట మధును గెలిపించాలని కోరారు. మ్యానిఫెస్టో, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఏఎంసీ చైర్ పర్సన్ మమతా మనోహర్, సర్పంచ్‌లు శ్రీపతిబాపు, లక్ష్మారెడ్డి, కిష్టయ్య, మల్లక్క, రాజక్క, చిన్న మల్లయ్య, ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, నాయకులు ఏ ప్రకాశ్, పీ వెంకటస్వామి, ఏ ప్రభాకర్, శ్రీహరి, టీ రమేశ్, చిటికేసి శ్రీనివాస్, గీత, ఓ స్వప్న, కే దేవేందర్, ఇబ్రహీం, తోట సుధాకర్, వీ జక్కయ్య, సాజిద్ అలీ, ఎండీ అలీం, మెరుగు శేఖర్, జీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### పుట్ట మధు గెలుపు కోసం పూజలు

మల్హర్ : బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధును భారీ మెజార్టీతో గెలుపొందాలని నాయకులు నాగులమ్మ, నైన, ఎమ్మార్ కంపెనీలో అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తాడిచర్ల, కొయ్యూర్, ఎడ్లపల్లి, చిన్నతూండ్ల గ్రామాల్లో మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, తాజుద్దీన్, కోట రవి, చేప్యాల రామారావు, గోనె శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఇం టింటా ప్రచారం నిర్వహించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే పుట్ట మధూకర్‌ను గెలిపించాలని కోరారు.

### కాటారంలో..

కాటారం : మండలంలోని కాటారం, ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి, ఒడిపిలవంచ, జాదురావుపేట, విలాసాగర్, గంగారం, దామెరకుంట గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింట ప్రచారం చేపట్టారు. బీఆర్ఎస్ రాష్ట్రనేత జక్కు రాకేష్, మండల పార్టీ అధ్యక్షుడు తోట జనార్ధన్ ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి సీఎం కేసీఆర్ మేనిఫెస్టో గురించి అవగాహన కల్పించారు. 30వ తేదీన జరగబోయే ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ఆయా కాలనీల్లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ విజయం కోసం క్రుషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు సంతోషం శ్రీనివాస్‌రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు రామిళ్ల కిరణ్, ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొండగొర్ల వెంకటస్వామి, మహిళా అధ్యక్షురాలు రత్న సౌజన్య, మండల ఉపాధ్యక్షుడు తోట రాంచందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పంతకాని సడువలి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తైనేని సతీశ్, ఎస్సీ సెల్ సబ్ డివిజన్ అధ్యక్షుడు చిట్యాల సమ్మయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు కే రాజబాబు, నాయకులు దుర్గం తిరుపతి, బొడ్డు రాజబాపు, శ్రీలక్ష్మీ చౌదరి, అయిత శకుంతల, బొల్లం రజనీ, కొమురయ్య, కుమార్ పాల్గొన్నారు.

### కాళేశ్వరంలో..

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో బీఆర్ఎస్ నాయకుడు మోహన్‌రెడ్డి అధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గ్రామంలో ప్రతి వాడలో గడపగడపకూ వెళ్లి మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు

## ప్రశాంత వాతావరణంలో ఓటెయ్యాలి

**డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి • సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్**

కాటారం, నవంబర్ 27 : ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ, సీఐ రంజిత్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన కూడలి మీదుగా కవాతు చేశారు. ఎన్నికల సమయంలో ఎవరు ఎలాంటి గొడవలకు పాల్పడవద్దన్నారు. కాటారం, మహాముత్తారం ఎస్సైలు అభినవ్, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

## నేడు కాటారంలో భారీ ర్యాలీ

కాటారం, నవంబర్ 27 : బీఆర్ఎస్ మంథని నియోజక వర్గ అభ్యర్థి పుట్ట మధు గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, మహిళా అధ్యక్షురాలు రత్న సౌజన్యారెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 7 గంటలకు కాటారం పెట్రోలు బంక్ నుంచి చింతకాని ఎక్స్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ప్రచారానికి పుట్ట మధు, జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రానున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మావోయిస్టుల కదలికలపై పోలీసుల నిఘా

**డ్రోన్ కెమెరాలతో పహారా**

వాజేడు, నవంబర్ 27 : మవోయిస్టులు జిల్లాలోకి ప్రవేశించినట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో వారి కదలికలను గుర్తించేందుకు పోలీసులు సోమవారం డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నట్లు పేరూరు ఎస్సై జీ రమేశ్ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతమైన పేరూరు పోలీసుస్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు అనుమానితులు గ్రామాల్లోకి వస్తే వెంటనే తమకు తెలియజేయాలని ఎస్సై కోరారు.

## బుగులోని జాతరలో గోవింద నామస్మరణ

రేగొండ, నవంబర్ 27 : మండలంలోని పాండవుల గుట్ట వద్ద బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరకు భక్తులు సోమవారం ఆధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో గుట్టలు మార్మోగాయి. రెండోరోజూ సోమవారం భక్తులు ఆధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏనుగు,మేకలతో చేసిన ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్సై నునిగంటి శ్రీకాంత్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆలయ మాజీ చైర్మన్ కడారి జనార్దన్, ఈవో బిళ్లు శ్రీనివాస్, సర్పంచ్ కట్లు రాణి, ఉప సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



రమేశ్ (ఫైల్)

తాడ్వాయి, నవంబర్ 27 : మండలంలోని నార్లాపురంలో ఈనెల 24న స్కూల్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు కాతా రమేశ్ మృతి చెందాడు. కిరాణా సామాను కొనుగోలు చేసి ఇంటికి బైక్‌పై వస్తుండగా తండ్రి కూతురును స్కూల్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో చిన్నారి యశ్విత మృతి చెందగా తండ్రి రమేశ్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రమేశ్‌ను వరంగల్ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. తండ్రి, కూతుళ్లు ఒకే ఘటనలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దు

మహదేవపూర్, నవంబర్ 27 : కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు బంధును ఆపాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. దీంతో రైతులపై వారి కపట ప్రేమ బయటపడిందన్నారు. కలప స్మగర్లు, కాంగ్రెస్ నాయకులు పుట్ట మధుపై అసత్య ప్రచారం మానుకోవాలన్నారు. కాంగ్రెస్ గూండా రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా పుట్ట మధు గెలుపు ఖాయన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వేమునూరి జక్కయ్య, ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, సీహెచ్ తారాచందు, మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్, మెరుగు లక్ష్మణ్, తలారి గట్టయ్య, గోగుల నాగేందర్, గోగుల మధు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

మొగుళ్లపల్లి, నవంబర్ 27 : మండలంలోని ఇస్సీపేటలో ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం .. జూకల్ గ్రామానికి చెందిన మేర్తెల నాగరాజు ట్రాలీ ఆటోలో పది క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. సురాబు రాజు అనే వ్యక్తి సూచన మేరకు బియ్యం తరలిస్తున్నట్లు నాగరాజు ఒప్పుకున్నాడు. ట్రాలీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## గణప సముద్రంలో పడి యువకుడి మృతి



కిరణ్ (ఫైల్)

గణపురం, నవంబర్ 27 : మండల కేంద్రంలోని గణప సముద్రం చెరువులో పడి యువకుడు సబ్బానీ కిరణ్ మృతి చెందాడు. ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన బట్టల వ్యాపారి కిరణ్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి బంధువులు భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం కిరణ్ గణన సముద్రంలోని శవమై తేలాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం భూపాలపల్లి దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడు కిరణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- ఆలయాల్లో భక్తుల సందడి
- భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు

వాజేడు, ఏటూరునాగారం, మంగపేట, ములుగు రూరల్, గోవిందరావుపేట, వెంకటాపురం (నూగూరు) నవంబర్ 27 : వివిధ మండలాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో వచ్చారు. నాగులమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి పాలను పుట్టలో పోశారు. సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించి దీపార్చన చేశారు. సూర్యోదయానికి ముందే భక్తులు జంపన్న వాగు, గోదావరి నదిలో దీపాలను వదిలారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఏటూరునాగారం ఆలయం వద్ద పూజలో రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు, శివాలయం కమిటీ చైర్మన్ తాడూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

### రామప్పలో..

వెంకటాపూర్ : మండలంలోని రామప్ప దేవాలయంలో సోమవారం వేలాది భక్తులు సందర్శించి స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు దేవాలయాల్లో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కేంద్ర మాజీ సహాయ మంత్రి, ఎంపీ పోన్న రాధాకృష్ణన్, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామి వారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాళేశ్వరం : ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

### కాళేశ్వరంలో..

కాళేశ్వరం : ముక్తీశ్వర ఆలయంలో సోమవారం భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. గోదావరి పుష్కరఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు చేశారు. గోదావరి మాతకు దీపాలు వదిలి, సైకత లింగాలను పూజించారు. ఒకేరోజు రూ.7 లక్షల అదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మహేశ్ తెలిపారు. జడ్పీ సీఈవో విజయలక్ష్మి, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది భక్తులు సత్య నారాయణ వ్రతం చేశారు.

## ఏజెన్సీలో పోలీసుల ముమ్మర తనిఖీ

వెంకటాపురం (నూగూరు) నవంబర్ 27 : మండల పరిధిలో సూరవీడు కాలనీ గ్రామ సమీపంలో ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు ముమ్మర తనిఖీ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండలానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీలో పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్ ←